
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
గురువారం 22 మే 2025



25న జీపీవో రాత పరీక్ష

జగిత్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న గ్రామ పాలనాధికారి పోస్టుల భర్తీ కొరకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులను గంట ముందుగా పరీక్ష హాలులోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు తమ వెంట రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఏదైనా గుర్తింపుకార్డు తీసుకొని రావాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌పై ఫొటో అతికించి, వారు పనిచేయు కార్యాలయ గెజిటెడ్ అధికారి సంతకం తీసుకొని రావాలన్నారు.

ఉత్తమ సేవలు అందించడంలో జిల్లా పోలీసుల ముందంజ

● రాష్ట్రంలోనే తొలి 10 స్థానాల్లో చోటు
● మేడిపల్లికి రెండో స్థానం, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు ఆరో స్థానం

జగిత్యాల అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ఫిర్యాదుదారులకు ఉత్తమ సేవలు అందించినందుకు పోలీస్ శాఖ క్యూఆర్ కోడ్ మరియు సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా పది పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేయగా జిల్లాలోని రెండు పోలీస్ స్టేషన్లకు స్థానం దక్కింది.

మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు రెండో స్థానం దక్కగా ఇబ్రహీం పట్నం పోలీస్‌స్టేషన్‌కు ఆరోస్థానం దక్కింది. రాష్ట్ర పోలీస్ శాఖ కొన్ని రోజులుగా పోలీస్ స్టేషన్లలో ప్రజలకు ప్రజలకు అందుతున్న సేవలు, ఫిర్యాదు దారులతో సిబ్బంది ప్రవర్తన తదతర విషయాలపై క్యూఆర్ కోడ్ మరియు సిఎఫ్‌సి ద్వారా అభిప్రాయ సేకరణ చేసింది. ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా ఎంపికైన మేడిపల్లి, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐలు శ్యాంరాజ్, అనిల్‌లను అధికారులు అభినందించారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఇందిరా భవన్‌లో రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం కృషి చేసిన శాంతి కాముకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, కాంగ్రెస్ నాయకులు చాంద్‌పాషా, ఉన్నారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల కోసం ఆయన ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుల చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్‌అధ్యక్షులు రాజేష్ ఉన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు నిధుల కొరత

● అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణం



అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు



● బిల్లులు చెల్లించక పోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్
● తాత్కాలిక షెడ్లలో తరగతులు
● అద్దె భవనంలో హాస్టల్
● విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు

అర్ధాంతరంగా నిలిచిపోయిన వసతి గృహ నిర్మాణ పనులు

జగిత్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. ఆగస్టులో ఎంబీబీఎస్ మరో బ్యాచ్‌కు భవనాలు అవ సరం కానున్నాయి. నిధులు లేకపోవడంవల్ల పనులు నిలిచిపోయి నట్లు వైద్య కళాశాల వర్గాలు పేర్కొంటున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల భవనాల పనులకు గత ప్రభుత్వం రూ.132 కోట్లు నిధులు మంజూరు చేసింది. 2022 డిసెంబరు 7వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ భూమి పూజచేసి పనులు ప్రారంభిం చారు. మెడికల్ కళాశాల, బాలికలు, బాలుర వసతి గృహాలతో పాటు అనుబంధంగా ఆసుపత్రి నిర్మాణానికి జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంపులో 8.6 ఎకరాలలో పనులు చేపట్టారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం, పర్యవేక్షకుల గదులు, అంతర్గత రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులకు ఆయా నిధులు వెచ్చించాల్సి ఉంది. మూడు దశల్లో పనులు పూర్తి చేయడానికి నిర్ణయించారు. మొదటి దశగా రూ.14 కోట్లు వెచ్చించి కళాశాల తరగతుల నిర్వహణ, తాత్కాలిక భవనాల ఏర్పాటు, ఇతర భవనాల అభివృద్ధి తదితర పనులను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం చెల్లించింది. రెండో దశలో భాగంగా రూ.115 కోట్ల నిధులతో మెడికల్ కళాశాల భవన నిర్మాణం, బాలుర, బాలికల వసతి గృహాలు నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం మారడం, నిధుల కేటాయింపులు లేకపోవడం వల్ల పనులపై తీవ్ర ప్రభావం చూపింది. కళాశాల ప్రధాన భవనాల పనులు తుది దశకు చేరాయి. ఇప్పటివరకు రూ.60 కోట్లకు సంబంధించిన పనులు పూర్తి చేశారు.

● రూ.49.8 కోట్ల బిల్లులు పెండింగ్

మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధించి రూ.49.80 కోట్ల పనులు బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్ ఆరు నెలలుగా పనులు చేయడం నిలిపివేశారు. ప్రస్తుతం మెడికల్ కళాశాల భవనంకు సంబంధించిన స్లాబ్‌లు, బ్రిక్స్ వర్క్స్ పూర్తయ్యాయి. బాలుర, బాలికల వసతి గృహాలకు సంబంధించిన స్లాబ్ నిర్మాణాలు జరిగినప్పటికీ బ్రిక్స్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రెండోదశ పనులు పూర్తయితే మూడో దశలో మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణం, ల్యాబ్స్ నిర్మాణం, ప్రిన్సిపాల్, ఆయా డిపార్ట్‌మెంట్ హెడ్స్‌కు క్వార్టర్స్ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను సుమారు రూ.60 కోట్లతో జరపాలన్న అంచనా ఉంది. అయితే రెండోదశలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆరు నెలలుగా పనులు ముందుకు జరగడం లేదు. 18నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా విధించారు. ఆ దిశగా పనులు కొనసాగకపోవడంతో 2024 డిసెంబరు 31వతేదీ వరకు గడువును పొడిగించారు. నిధుల కొరతతో గత యేడాది డిసెం బరు నెలాఖరు వరకు పనులు పూర్తి కాలేదు. దీంతో మూడో మారు పనుల గడువును పొడగించాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. సంబంధిత ప్రతిపాదనలు పంపి ఆరు నెలలు గడిచినప్పటికీ ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదు. ఒక వైపు నిధులు మంజూరు కొరకు, మరో పనులు పూర్తి చేయడానికి గడువును పొడగించడానికి అవసరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమీక్షించినా...

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల జిల్లాలో పర్యటించిన సందర్భంగా మెడికల్ కళాశాల భవననిర్మాణాల పనులపై సమీక్షించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్‌లతో కలిసి మెడికల్ కళాశాల భవన నిర్మాణ పరిస్థితిపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షించారు. మెడికల్ కళాశాల భవన నిర్మాణ ..

మిగతా 8లో

బోధనలో మెళకువలు పాటించాలి

-జిల్లా విద్యాధికారి రాము



మాట్లాడుతున్న డీఈవో రాము

మల్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నూతన మెళకువలతో పాఠాలు బోధించాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. మల్యాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించాలని పేర్కొన్నారు. డీఈవో వెంట మండల విద్యాధికారి ఎస్.జయసింహరావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేక కేసీఆర్‌కు నోటీసులు

-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

జగిత్యాలఅగ్రికల్చర్, మే21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగంగానే బీఆర్ఎస్ అధినేతకు కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ నోటీసులు అందించిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడువారిన నేలకు నీటిని అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెడుతూ రైతులను గోసపెడుతోందని విమర్శించారు. ఎన్ని నోటీసులయినా ధైర్యంగా ఎదుర్కొంటామని ఆయన స్పష్టం చేశారు.

ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

● ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్

జగిత్యాలఅగ్రికల్చర్, మే21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులు పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లతకు ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ వినతిపత్రం అందజేశారు. అనంతరం జగిత్యాలలో విలేఖరుల సమావేశంలో రాకేష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల పెంపును ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ బాధ్యులు రాసూరి ప్రవీణ్, సిద్దార్థ, శ్రీకాంత్, నిఖిల్ తదితరులున్నారు.

వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఎమ్మెల్యే సంజయ్ పార్టీ ఫిరాయింపు

● మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ప్రయోజనాల కోసమే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించాడని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి విమర్శించారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాలే అభివృద్ధి అంటే దానికి ఎవరూ జవాబు చెప్పలేరని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో అత్యధికంగా బీ ఫారాలు తీసుకున్నది, ఎక్కువసార్లు ఓడింది జీవన్‌రెడ్డియేనని ఇటీవల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విమర్శించడంపై జీవన్‌రెడ్డి స్పందించారు. చట్టసభల ఎన్నికల సందర్భంగా అత్యధికంగా బీఫారంలు అందడం కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధానికి నిదర్శనంగా భావిస్తున్నానని జీవన్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లో చేరి 40 సంవత్సరాలుగా పార్టీకోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎన్నడూ అధికార పార్టీతో అంటకాగేందుకు తాను ప్రయత్నం చేయలేదని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ తనదన్న చందంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వ్యవహ రిస్తారని విమర్శించారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులో సుమారు వంద ఎకరాల భూమి అన్యాక్రాంతం అయితే సంజయ్ కుమార్ పట్టించుకోలేదని జీవన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌పై పోటీ చేసినానన్నారు. గత యేడాది జరిగిన నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో మత పరంగా ఓటర్లను ప్రభావితం చేశారో అందరికీ తెలుసునన్నారు. మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు శాసన మండలిలో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు వ్యతిరేకించిన ఒకే ఒక్కడినిగా గుర్తింపు పొందానన్నారు. తన రాజకీయ జీవితం నల్లేరు నడక కాదని... ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అంత అదృష్టవంతుడిని కాదన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలే అభివృద్ధి అంటే దానికి ఎవరు జవాబు చెప్పలేరని తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు కొత్త మోహన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజెంగి నందయ్య, గాజుల రాజేందర్, చాంద్ పాషా, దుర్గయ్య, రాజేందర్, రాధాకిషన్, చాంద్‌పాషా, రమేశ్, మన్సూర్, ఎంఏ బారీ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

● కలెక్టర్ సత్యప్రసాద్



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, మే, 21 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం వర్షానికి తడిసిన ధాన్యం సంచులను పరిశీలించారు. వర్షానికి ఎన్ని సంచులు, ఎంత ధాన్యం కుప్పలు తడిసాయని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యం సంచులను బాయిల్డ్ రైస్ కింద మిల్లులకు తరలించాలన్నారు. మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి కావాలని సూచించారు. రెండు రోజుల పాటు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, రైతులు, నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలన్నారు. తూకం వేసిన ధాన్యం సంచులను ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లర్లతో మాట్లాడి తరలించాలని, తరలించేందుకు లారీలు అందుబాటులో ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ రాజుమహమ్మద్, ఆర్ఐ ఉమేష్, సీఈవో శేఖర్, అధికారులు, నిర్వహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

● రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం ● జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, మే 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇటిక్యాల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖానా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికలవరకే పరిమితమని, అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ఎంపీడీవో చిరంజీవి, ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్, ఏఈ రాజమల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మాండ్లు, కోల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, గన్నె రాజరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బెజ్జంకి రమాదేవి మోహన్, వాసరి రవి, శ్రీనివాస్ గౌడ్, గంగారెడ్డి, సామల్ల వేణు పాల్గొన్నారు.

దారులన్నీ కొండగట్టుకే..

● తరలివస్తున్న దీక్షాపరులు, భక్తులు
● రెండో రోజు వైభవంగా ఉత్సవాలు
● నేడు హనుమాన్ పెద్ద జయంతి



కొండగట్టుకు వస్తున్న దీక్షాపరులు

6

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

● ఈదురుగాలులకు కూలిన చెట్లు
● విరిగి పడిన విద్యుత్ స్తంభాలు
● విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



గుల్లపేటలో తడిసిన ధాన్యం

8

దారులన్నీ కొండగట్టుకే..



- తరలివస్తున్న దీక్షాపరులు, భక్తులు
- రెండో రోజు వైభవంగా ఉత్సవాలు
- నేడు హనుమాన్ పెద్ద జయంతి

మల్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దీక్షా పరుల సంకీర్తనలతో, భక్తుల జై హనుమాన్ ఘోషతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం పులకిస్తోంది. రామనామ సంకీర్తనలతో అంజన్న పరిసరాలు భక్తి పారవశ్యంతో నిండిపోతున్నాయి. రామదండును తలపించేలా భక్తులు కొండగట్టుకు వస్తుండగా ఆలయం కాషాయ వర్ణంతో కళకళలాడుతోంది. మంగళవారం నుంచి ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలతో బుధవారం రాత్రి కొండంతా భక్తజన శోభితంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా దీక్షాపరులు కాలినడకన, వాహనాల్లో కొండపైకి చేరుకుని మాల విరమణ చేస్తున్నారు.

వైభవంగా జయంతి ఉత్సవాలు

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం యాగశాలలో వేద పండితులు, అర్చకులు స్థాపిత దేవతారాధన, హోమం, సుందరకాండ పారాయణం, పంచామృత అభిషేకం, సహస్ర నామా ర్చన, విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ అమ్మవారి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు తిరుక్కోవెల కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు, ఉప ప్రధాన ర్చకులు చిరంజీవ స్వామి, మారుతీ ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్ర శేఖర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. సాయం కాలం ఆలయ ఆవరణలో కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తలదాచుకోవడానికి పాట్లు పడ్డారు. మాల విరమణ, దర్శనం కోసం బారులు తీరారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గురువారం హనుమాన్ పెద్ద జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి త్రైయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా వేలాది దీక్షాపరులు మాల విరమణ చేసేందుకు కొండగట్టుకు తరలివస్తున్నారు. మంగళవారం నుంచి ఆలయం ముందు గల యాగశాలలో త్రైయాహ్నిక ఉత్సవాల యాగంను మహా వైభవంగా నిర్వహిస్తుండగా గురువారం వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి నిర్వహించనున్నారు.



యాగం నిర్వహిస్తున్న అర్చకులు





కొండగట్టులో మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు, ఆలయ ఆవరణలో దీక్షాపరుల సందడి

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం



దరఖాస్తు చేసుకునే విధానం

మీసేవా కేంద్రాల ద్వారా టీఎస్ ఈపాస్ పోర్టల్లో telanganaepass.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి తన పూర్తి వివరాలు, పదో తరగతి మార్కుల ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, నాలుగు నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువపత్రాలను సమర్పించాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1.5లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షలకు మించరాదు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం 36 వేల రూపాయల ప్రోత్సాహకం అందించనుంది..

గణేశ్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్యచాలా కీలకమైనది. చాలామందికి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ విద్య అభ్యసించాలనే కోరిక ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ విద్య పేదలకు అందని ద్రాక్షగా మారింది. ప్రతిభ ఉన్న పేద విద్యార్థుల కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్పొరేట్ విద్యా పథకాన్ని తీసుకొచ్చింది. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఈ పథకం ద్వారా తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ఈ పథకానికి సంబంధించి 2025-26 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తుల స్వీక రణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభు త్వం ప్రోత్సాహకం అందించనుంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నాలుగు వందలకుపైగా మార్కులు సాధించిన ఎస్సీ ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థులు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత, ఎయిడెడ్, కస్తూర్బా, నవోదయ, గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎంపికైన విద్యార్థు లకు కళాశాలతో కూడిన సమాచారం అందిస్తారు.

పేద విద్యార్థులకు ఉపయోగకరం

పి పవన్ కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి



కార్పొరేట్ విద్యా పథకం ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలి. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన విద్యార్థులకు రెండేళ్లపాటు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య, వసతి కల్పిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

హుజూరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్‌బ్యాంక్ ఉద్యోగి ద్విచక్రవాహనంపై అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఓ టిప్పర్‌లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చౌరస్తా వద్ద ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

గుడి చెరువులో రెండు మృతదేహాలు లభ్యం

వేములవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్లజిల్లా వేములవాడ గుడిచెరువులో బుధవారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఇద్దరు మగవారి మృతదేహాలను గుడి చెరువులోని వేర్వేరు ప్రాంతాల్లో గుర్తించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు గుడి చెరువులో రెండు మృతదేహాలను గుర్తించి వెలికితీశామని ఆయన తెలిపారు. మృతుల్లో ఒకరు 55-60 సంవత్సరాలు, మరొకరు 35-40 సంవత్సరాల వయసు ఉన్నట్లు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాల వద్ద వారి చిరునామా, ఇతర వివరాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, రెండు మృతదేహాలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు వేరు వేరు సమయాల్లో మృతిచెందినట్లు తెలుస్తోందని, మరణానికిగల కారణాలు ఇంకా వెలుగులోకి రాలేదన్నారు. ఆచూకీ తెలియని వ్యక్తులకు సంబంధించిన బంధువులు మృతదేహాలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో పరిశీలించవచ్చని తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో..

మానకొండూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలోగల ఎస్సారెస్పీ ప్రధానకాలువలో బుధవారం కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సారెస్పి ప్రధాన కాలువలో లభ్యమైన మృతదేహం మూడు నుంచి నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని తెలిపారు. ఇతను బీహార్ లేదా ఇతర ప్రాంతాలకు చెందిన వలస కూలీ అయి ఉండొచ్చన్నారు. వయస్సు 30 నుంచి 35గా ఉన్నట్లు తెలిపారు. గ్రామ కారోబార్ ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి గీతకార్మికుడు మృతి



బాలరాం (ఫైల్)

ముస్తాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌గ్రామానికి చెందిన పెద్దూరి బాలరాం (50) అనేగీత కార్మికుడు కల్లుగీసేందుకు వెళ్లి చెట్టుపై నుంచి జారిపడి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. గ్రామశివారులో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మరణించాడు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గీతకార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీపీఏసీఎస్ ఛైర్మన్ బొందుగుల దేవిరెడి, మాజీ సర్పంచ్ యారటి లక్ష్మీ, గాంత రాజులు కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మానస (ఫైల్)

మల్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజరం గ్రామంలో బుధవారం డిష్ తీగలు ఓ మహిళ ప్రాణాలు తీశాయి. బట్టలు ఆరవేస్తూ విద్యుదాఘాతంతో శీలం మానస(30)అనే మహిళ మృతిచెందింది. ఇంట్లో బట్టలు ఆరవేస్తుండగా పక్కనే డిష్ బాక్స్‌కుచెందిన తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో మానసను చికిత్స కోసం జగిత్యాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. డిష్‌బాక్స్‌ను తొలగించాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని డిష్ నిర్వాహకులపై మృతురాలి తల్లి అవారి మల్లీశ్వరి పోలీసులకు ఫిర్యాదుచేసింది. మానసకి భర్త, కొడుకు, కూతురు ఉన్నారు. భర్త సంతోష్ మంగళవారమే ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగ సంతోష్ మళ్లీ తిరిగివస్తుండడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలో పేకాట ఆడుతున్న 13మందిని కొత్తపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రేకుర్తిలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి ఏఎస్సై పోచయ్య ఆధ్వర్యంలో దాడి చేశారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.3లక్షల65వేల నగదు, 14సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారికి నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

‘జెమ్’తో అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం

- బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి
- విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ



యోగా చేస్తున్న అమ్మాయిలు



కరాటేలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

జ్యోతినగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తితోపాటు సామాజిక వికాసానికి ఎన్టీపీసీ కృషి చేస్తున్నది. ప్రధానంగా ప్రభావిత ప్రాంతంలో విద్యాభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్) పథకం కింద నిధులు కేటాయించి వివిధ పనులకు వినియోగిస్తోంది. దీనిలో భాగంగానే ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం నింపడంతో పాటు బాలికాసాధికారతకు ఎన్టీపీసీ చేయూతనందిస్తోంది. గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్(జెమ్) పేరిట చుట్టుపక్కల సర్కారు బడుల్లో 8వ తరగతి చదువుతున్న 120 మంది బాలికలకు నెలరోజులపాటు ప్రత్యేక వర్క్‌షాప్(శిక్షణ) నిర్వహిస్తోంది. ఏడవ తరగతి పూర్తయి 8వ తరగతికి వచ్చిన 120 మంది విద్యార్థులను ఎన్టీపీసీ ఎంపిక చేసింది. ఈ నెల 6న ప్రారంభమైన జెమ్ వర్క్‌షాప్‌లో వీరికి వివిధ సబ్జెక్టులతో పాటు ఇతర రంగాలలో తర్ఫీదునిస్తున్నారు. భువనేశ్వర్‌కు చెందిన తన్వీ కన్సల్టెన్సీ సంస్థ సహకారంతో 28 రోజుల పాటు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణనిస్తున్నారు. 2019 నుంచి ప్రతిఏటా జెమ్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు.

చదువుతోపాటు స్వీయ రక్షణలో శిక్షణ

జెమ్‌లో భాగంగా బాలికలకు చదువుతో పాటు స్వీయరక్షణ, ఇతరఅంశాలలో శిక్షణనిస్తున్నారు. తెలుగు,హిందీ,ఇంగ్లీషు, మ్యాథమెటిక్స్ సైన్స్ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో బోధిస్తున్నారు. అలాగే సెల్ఫ్ డిఫెన్స్‌లో భాగంగా కరాటే నేర్పిస్తున్నారు. యోగా, చిత్రలేఖనం, హస్తకళల్లో ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. సాంస్కృతిక అంశాలలో భాగంగా నృత్యం నేర్పిస్తున్నారు. కంప్యూటర్స్‌లో ప్రాథమిక అంశాలను(బేసిక్స్) విద్యార్థినులకు నేర్పిస్తున్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించడం జంకులేకుండా ఉపన్యాసం ఇచ్చేలా తర్ఫీదునిస్తున్నారు. తాము జీవితంలో ఏమి కావాలనుకుంటున్నారో నిర్ణయించుకునేలా మోటివేషన్ క్లాసులు ఇప్పిస్తున్నారు.

ఉదయంనుంచి సాయంత్రం వరకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శిక్షణ పొందుతున్న బాలికలకు వసతితోపాటు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. ఎన్టీపీసీలో ఇండస్ట్రియల్ క్యాంటీన్ నిర్వహిస్తున్న ఐసీహెచ్(ఇండియన్ కాఫీ హౌజ్) సంస్థ విద్యార్థినిలకు రుచికరమైన భోజనం, అల్పాహారం అందిస్తోంది.

శిక్షణ ఎంతో ఉపకరిస్తోంది..

- జి.గాయత్రి, మొఘల్‌పహాడ్



జెమ్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. చదువు సంబంధ సబ్జెక్టులతోపాటు మాకు ఇతర అంశాలను నేర్పిస్తున్నారు. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. జెమ్‌లోనృత్యంలో నాకు సోలో, గ్రూప్ డ్యాన్స్ నేర్పిస్తున్నారు.

మ్యాథ్స్‌లో శిక్షణ ఇస్తున్నారు..

- స్వాతి, దుర్గయ్యపల్లి జెడ్పీస్కూల్



నాకు లెక్కల సబ్జెక్టు అంటే ఎంతో ఇష్టం. మ్యాథ్స్‌లో ప్రత్యేకశిక్షణ ఇస్తున్నారు. గతంలో కన్నా ఇప్పుడు లెక్కలు సులువుగా అర్థమవుతున్నాయి, చేస్తున్నాను. మిగతా అంశాలు యోగా, డ్రాయింగ్‌లో శిక్షణతో వాటిపై ఆసక్తి పెరిగింది.

జెమ్ భవిష్యత్‌కు దిక్సూచి

- ఎం.వామిక, గాంధిపార్క్ జెడ్పీ స్కూల్



జెమ్ శిక్షణ నా భవిష్యత్‌కు దిక్సూచి లాంటింది. నాకు ఇంగ్లీషు సబ్జెక్టు అంటే ఇష్టం. కానీ మాస్కూల్లో అంతబాగా నేర్చుకోలేకపోయాను. జెమ్‌లో టీచరు ప్రత్యేకంగా ఇంగ్లీషు బోధిస్తున్నారు. సులువుగా అర్థమయ్యేలా చెబుతున్నారు.

సాధికారత, డ్రాపౌట్లు తగ్గించేందుకు

- విజయ్ కుమార్ సిక్దర్, హెచ్‌వోడీ(హెచ్ఆర్)



ప్రభావిత ప్రాంతంలోని బాలికల సాధికారత, అమ్మాయిల డ్రాపౌట్లు తగ్గించడంలో జెమ్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో జరిగిన నాలుగు జెమ్ వర్క్‌షాప్‌లలో శిక్షణ పొందిన విద్యార్థినుల్లో మెజారిటీ విద్యార్థినులు మంచి కెరీర్‌ను ఎన్నుకొని ముందుకు నడుస్తున్నారు. సామాజిక బాధ్యతగా జెమ్ నిర్వహిస్తు న్నాం. భవిష్యత్‌లో బాలికల అభ్యున్నతి కోసం జెమ్‌తోపాటు సీఎస్ఆర్ పథకం కింద ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తాం.

వృత్తి నైపుణ్య శిక్షణ

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగునూర్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో చదివి, ఉద్యోగం రాని వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో చదువుకొని ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం రానివారు ఉంటే వారికి ప్రత్యేకంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధిపొందేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకోసం ప్రభుత్వచొరవతో ఉన్నతిఫౌండేషన్ ముందుకొచ్చి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. 19నుంచి 25ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గురుకుల పూర్వవిద్యార్థులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గౌలిదొడ్డి కళాశాలలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి కోరారు.

కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల తనిఖీ



వివరాలను తెలుసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని కొనుగోలు కేంద్రంతోపాటు పలుగ్రామాల్లోని రైస్‌మిల్లులను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ప్రతినిధులు లక్ష్మారెడ్డి, జంగయ్య బుధవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రైతుల వివరాలను, ధాన్యం నాణ్యతలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యంకొనుగోలు చేయాలని సూచించారు. రైస్‌మిల్లులలోని దిగుమతి చేసుకున్న ధాన్యం వివరాలకు సంబంధించిన రికార్డులు, పత్రాలను పరిశీలించారు. ధాన్యంకొనుగోలు, రైస్‌మిల్లుల్లోని ధాన్యం నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీటీసీఎస్ అశోక్, ఇన్‌చార్జి డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం మల్లేశం తదితరులు ఉన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని పట్టుకున్నామని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. బండలింగంపల్లి గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ అల్లెపు వంశీకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. మండలంలోని పదిర గ్రామ శివారు మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రాజన్నపేటలోని వాహన డ్రైవర్ శివరాత్రి నర్సయ్య సూచన మేరకు పికప్ వాహనంలో ఇసుకను తరలిస్తు పట్టుబడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి డ్రైవర్ వంశీకృష్ణను అరెస్ట్ చేశామని వెల్లడించారు. యజమాని నర్సయ్య పరారీలో ఉన్నాడని వివరించారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడి మృతి

కోల్‌సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్‌లో నివాసముండే సింగరేణి కార్మికుడు మంకిడి సాంబమూర్తి(53) ఈనెల4న ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. సాంబమూర్తి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో కుటుంబ సభ్యులు ప్రశ్నించగా మనస్తాపానికి గురై 4వతేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. సింగరేణి ఆసుపత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. అతనికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

పంటల వైద్యుడు ‘ప్లాంటిక్స్’ యాప్

- రైతుల కోసం రూపొందించిన ఇక్రిశాట్



చొప్పదండి, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులకు సాగులో సహాయం చేస్తుంది ‘ప్లాంటిక్స్’ యాప్. పలు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్ ద్వారా రైతుల 35 రకాల పంటల సమాచారం అందుతుంది. రైతుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు కమ్యూనిటీ ఫీచర్ అందుబాటులో ఉంది. జర్మనీకి చెందిన సంస్థ ఇక్రిశాట్ భాగస్వామ్యంతో ఈ ప్లాంటిక్స్ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఏఐ ఆధారంగా రైతులకు ఈ మొబైల్ యాప్ సలహాలు, సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతుంది.

పంటల సాగులో సలహాలు, సూచనలు

రైతులు పంటల కోసం రూపొందించిన యాప్ వైద్యుడిగా పేరొందింది. పంటల్లో చీడపీడలు, తెగుళ్ల, వ్యాధులను గుర్తించి వెంటనే రైతులకు సలహాలు, సూచనలు ఇస్తుంది. పరిష్కార మార్గాలను తెలుపుతూ, వ్యాధుల నివారణకు మందులను ప్రతిపాదిస్తుంది. రైతులకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో నెలకొన్న వాతావరణ సమస్యలు, భూసారంలో లోపాలను యాప్ ఏఐ సహకారంతో గుర్తిస్తుంది. మొక్కలకు అందించాల్సిన పోష విలువలను, ఎరువుల వాడకాన్ని సూచిస్తుంది. అందుబాటులో ఉన్న శాస్త్రవేత్తల సలహాలను కూడా పొందవచ్చు.

పంట ఫొటోలు అప్‌లోడ్ చేయాలి...

రైతులు తమ పంటలో తెగుళ్ల, పోషక లోపాలు, వ్యాధులకు సంబంధించిన ఫోటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. వెంటనే పురుగులను, సమస్యను గుర్తించి పరిష్కార మార్గాన్ని చూపుతుంది. 30 ప్రధాన పంటలకు సంబంధించిన 780 రకాల వ్యాధులు, తెగుళ్లను యాప్ గుర్తించి సలహాలు, సూచనలు ఇస్తుంది. ఈ యాప్ 19 ప్రాంతీయ భాషల్లో సమాధానాలు ఇస్తుంది. యాప్ ద్వారా 500 మంది వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పొందవచ్చు.

రైతులకు తమ ప్రాంతాల్లో పంటలకు రాబోయే వ్యాధులు తెలుపుతూ హెచ్చరికలను కూడా ఈ యాప్ అందిస్తుంది. వాతావరణ సూచనలు, ఎరువుల వాడకాన్ని తెలియజేస్తుంది. భూమిలో పోషకాల లోపాలను గుర్తిస్తుంది. తద్వారా పంట నష్టాన్ని తగ్గించి, అధిక దిగుబడిని పొందవచ్చు. దీంతోపాటు రైతులు తమ ఉత్పత్తులను విక్రయించడానికి డిజిటల్ ప్లాట్‌ఫాంగా పనిచేస్తుంది. ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఉన్న ధరలను తెలుసుకోవచ్చు. ప్లే స్టోర్ నుంచి ప్లాంటిక్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.




త్రిలింగ క్షేత్రం..
పుష్కర శోభితం

ఏడోరోజు లక్ష మందికిపైగా పుణ్యస్నానాలు

అకాలవర్షంతో భక్తులకు ఇబ్బందులు

కాళేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): త్రిలింగ క్షేత్రం.. కాళేశ్వరం పుష్కర శోభితమై వెలుగులీనుతోంది. వేలాదిగా తరలొస్తున్న భక్తజనంతో త్రివేణి సంగమం సందడిగా మారింది. సరస్వతి పుష్కరాల్లో ఏడో రోజైన బుధవారం లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది వాహనాల్లో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో సరస్వతీ మాతకు చీర, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలారు. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సంఖ్య రద్దీగా ఉండడంతో అధికార యంత్రాంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్‌కు వెళ్లేందుకు అధిక సంఖ్యలో ఉచిత బస్‌లను అందుబాటులో ఉంచారు. అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించి అన్నారం క్రాస్ రోడ్డు నుంచి పుష్కర ఘాట్, తాత్కాలిక బస్టాండు వరకు ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించారు. అకాల వర్షంతో రోడ్లన్నీ బురదమయమై భక్తులు ఇబ్బంది లు ఎదుర్కొన్నారు.

● పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు

సరస్వతి పుష్కరాల్లో బుధవారం బెల్లంపల్లి శాసనసభ్యుడు, మాజీ మంత్రి గడ్డం వినోద్ కుమార్, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు, ఎస్పీ కిరణ్‌ఖరే అంతర్వాహినిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.




గోదావరి వద్ద పూజలు



గోదావరికి ఎడ్ల బండ్లలో వస్తున్న భక్తులు



పుణ్యస్నానాలాచరిస్తున్న యువతులు

24న ఉమ్మడి జిల్లా అండర్-11 చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-11 బాల బాలికల చదరంగ పోటీలను ఈ నెల 24వ తేదీన కరీంనగర్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీలో ఈ పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తామని పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2015 తర్వాత జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటలలోపు 9390177607 నంబరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో 19 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీ క్షల్లో బుధవారం మాల్ ప్రాక్టీస్ చేసిన 19 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని అపూర్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, హుజూరాబాద్‌లో శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, మహదేవపూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో 16 మందిని డీబార్ చేసినట్లు వివరించారు.

మామిడి లారీ బోల్తా

జగిత్యాల అగ్రికల్చర్, మే 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున మామిడి లారీ బోల్తా పడింది. హైలెవల్ బిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా ఖమ్మం నుంచి ఢిల్లీ వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన మామిడి లారీ బోల్తా పడింది. దీంతో డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికుడు సుమేరుద్దీన్ ఆజాద్ 108 వాహనంతో పాటు పట్టణ పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ డ్రైవర్, క్లీనర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అనాథ యువతి పెళ్లి పెద్దగా కలెక్టర్

● అంగరంగ వైభవంగా మానస వివాహం

● హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన మానసతో పాటు తన చెల్లెలు లక్ష్మి పదహారేళ్ల క్రితం ఒక బాలల సంరక్షణ కేంద్రానికి చేరారు. ఆశ్రమ నిర్వాహకులు వారిని పెంచి పెద్ద చేశారు. ఉన్నత చదువులు చదివిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన నక్క మానసకు పెళ్లి కుదిరింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష పెళ్లి పెద్దగా నిలిచి మానసకు అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో గల తబిత బాలల సంరక్షణ ఆశ్రమంలో నక్క మానస, ఆమె చెల్లెలు నక్క లక్ష్మి పదహారేళ్లుగా ఆశ్రయం పొందుతున్నారు. వీరి తల్లితండ్రులు చిన్నపుడే మరణించడంతో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీస్ (ఐసీపీఎస్) అధికారులు వీరిని ఆశ్రమంలో అప్పగించారు. అప్పటి నుంచి తబిత ఆశ్రమం నిర్వాహకులు వీరేందర్ నాయక్, విమల దంపతులు వారికి తల్లితండ్రులు లేని లోటు తీర్చి తమ సొంత పిల్లలుగానే పెంచి పోషించారు.



టీఎస్జీవో నాయకులు అందజేసిన చెక్కును మానస దంపతులకు ఇస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు

మానస కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యింది. మానస పెళ్లీడుకు రావడంతో పెళ్లి సంబంధాలు చూడడం ఆరంభించారు. జనగాం జిల్లా రఘునాథపల్లికి చెందిన మాస రేణుక, యాకయ్యల కుమారుడు మాస రాజేష్ ఎలాంటి కట్నకానుకలు లేకుండానే మానసను పెళ్లి చేసుకునేందుకు ముందుకు వచ్చాడు. మానస పెళ్లి ఘనంగా జరిపించాలనే ఉద్దేశంతో ఈ విషయాన్ని జిల్లా సంక్షేమ శాఖాధికారి పి వేణుగోపాల్‌రావుకు ఆశ్రమ నిర్వాహకులు తెలియజేశారు. ఆయన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకవెళ్లారు. స్పందించిన కలెక్టర్ సొంత ఖర్చులతో పెళ్లి జరిపించేందుకు ముందుకు వచ్చి ముహూర్తం ఖరారు చేశారు. పెళ్లికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు.


బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 11:05 గంటలకు పండితులు వేద మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా మానస, రాజేష్‌ల వివాహం జరిపించారు. అంతకు ఒక రోజు ముందు రామగుండం తబిత ఆశ్రమంలో పెళ్లి కూతురును చేయడం, హల్ది, హిందూ సంప్రదాయం ప్రకారం ఆశ్రమం నిర్వాహకులు అన్ని వేడుకలు జరిపించారు. ఈ వివాహానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా సంక్షేమ శాఖాధికారి పి వేణుగోపాల్ రావు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ఆశ్రమ నిర్వాహకులు కన్యాదానం చేశారు. ఈ పెళ్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అదనపు కలెక్టర్లు డి వేణు, జె అరుణశ్రీ, టీజీఓ జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ తమ సంఘం తరపున 61,800 రూపాయల చెక్కును అందజేశారు. ప్రతి వివాహ వేడుక కు హాజరై వధూవరులను ఆశీర్వదించి కట్నాలు తీసుకునే ట్రాన్స్‌జెండర్లు ఈ వధూవరులకు బట్టలు పెట్టి 11 వేల కట్నం చదివించి ఆశీర్వదించారు. సాయంత్రం భరాత్ నిర్వహించి నవ వధూవరులను సాగనంపారు. తన తోబుట్టువు తనను వదిలి అత్తారింటికి వెళ్లడంతో లక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించింది. ఈ వివాహం వేడుకలను జరిపించడంలో తబిత ఆశ్రమ నిర్వాహకులతో పాటు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది చాలా శ్రమించారు.

ఎన్టీపీసీ ప్లాంటులో ప్రమాదం..

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

జ్యోతినగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం జరిగిన ప్రమాదంలో కొమురయ్య, అంకూస్ అనే ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్టేజ్ 2 పరిధిలోని ప్రెజర్ పార్ట్స్ విభాగం హెచ్ఎఫ్‌వో వద్ద పనిచేస్తుండగా పైపు పగిలి వేడి ఆయిల్ కార్మికులపై పడడంతో ఈ ప్రమాదం జరిగింది. కాలిన గాయాలైన ఇద్దరిని ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కొమరయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. లక్ష్మీపురానికి చెందిన కొమరయ్య, అన్నపూర్ణ కాలనీకి చెందిన అంకూస్‌లు ఫ్యాబ్ ఎరక్టర్స్ అనే కాంట్రాక్టు సంస్థలో పని చేస్తున్నారు. ప్రమాదంపై ఎన్టీపీసీ యాజమాన్యం విచారణ చేపట్టినట్లు సమాచారం.

ప్రకృతి సంరక్షణతోనే జీవ వైవిధ్యం



● కాలుష్య నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ

○ సహజ వనరుల విధ్వంసంతో వినాశనం....

● నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం

కరీంనగర్ అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మనిషి మనిషిని రక్షించడం మానవత్వం. అదే జీవ వైవిధ్యాన్ని రక్షించి సంరక్షించడం దైవత్వం. జీవవైవిధ్యం ప్రకృతి ఇచ్చిన వరం. మానవుడి మనగడకు ఆధారం. దానిని కాపాడుకోవడం మన తక్షణ కర్తవ్యం. మానవుడు తన కార్యకలాపాలను ప్రకృతికి అనుకూలంగా మార్చుకుని జీవ వైవిధ్యం అం తరించకుండా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాలుష్య నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. సహజ సిద్ధ వనరులను ఎడాపెడా వినియోగిస్తూ విధ్వంసం



చేస్తుండడం జీవుల మనుగడకే ప్రమాదకరంగా పరిణమించింది. పర్యావరణ సమతుల్యతను కాపాడితేనే మానవ మనుగడకు అవకాశం ఉంటుంది. మనుషుల ప్రస్తుత జీవనశైలిలో మార్పులు తీసుకువచ్చి విరివిగా రసాయనాల వినియోగం, ప్లాస్టిక్ వాడకం, చెట్ల నరికివేత, గుట్టల ధ్వంసం, వన్యప్రాణుల వేట వంటివి తగ్గించుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుని కాలుష్య నియంత్రణకు పాటుపడాల్సిన అవసరం ఉంది.

వనాలు, వన్యప్రాణులు, సహజసిద్ధమైన గుట్టలు, నదులపై మానవ మనుగడ ఆధారపడింది. అడవుల ధ్వంసం వల్ల గ్లోబల్‌వార్మింగ్ పెరిగిపోతున్నది. మరోవైపు విచక్షణారహితంగా వన్యప్రాణుల వేటతో ప్రతి రోజు 72 జీవ జాతులు, గంటకు మూడు వన్యప్రాణులు అంతరించిపోతున్నట్లు పలు అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రకృతి సహజసిద్ధమైన వనరులను అవసరానికి మించి వినియోగిస్తుంటడంతో పర్యావరణం కలుషితమై భూతాపం పెరగడం మూలంగా సున్నితమైన కొన్ని జీవజాతులు అంతరించిపోతున్నాయి. అడవులు రోజు రోజుకు తరిగి పోవడంతో వన్యప్రాణులు ఆవాసం కోల్పోయి, ఆహారం లేకుండా అంతరించేస్థాయికి చేరుకుంటున్నాయి. పులులు, సింహాలతో పాటు మరి కొన్ని అరుదైన ప్రాణులు అంతరించే స్థాయికి చేరుకున్నాయి. సహజ వనరులను మితంగా వినియోగించుకుని, పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ విచక్షణతో వ్యవహరించినప్పుడే జీవవైవిధ్యం సురక్షితంగా ఉంటుంది. అప్పుడే సమస్త జీవులు మనుగడను సాగిస్తాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూతాపం పెరిగి ప్రకృతిలో పెను మార్పులు సంభవిస్తాయి. దీంతో అతివృష్టి, అనావృష్టి ఏర్పడి తాగు, సాగునీటికి కటకట, పశుగ్రాసం లేక ఇబ్బందులు ఏర్పడుతాయి. భూమిలోని 84 లక్షల జీవరాశుల్లో ప్రస్తుతం 24 లక్షల జాతులు మాత్రమే జీవించి ఉన్నట్లు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

జీవవైవిధ్య రక్షణకు..

- జంతువుల, పక్షుల ఆవాసాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.
- రోడ్లకిరువైపులా పండ్లు, కలపనిచ్చే చెట్లను విరివిగా పెంచాలి.
- అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం తాగునీటి తొట్లు, చెక్ డ్యాంలు నిర్మించాలి.
- సామాజిక అడవులను ప్రోత్సహించాలి.
- రైతులు ప్రకృతి వ్యసాయాన్ని అనుసరించాలి. కృత్రిమ ఎరువులు, రసాయనిక పురుగుల మందులను ఉపయోగించకుండా అవగాహన కల్పించాలి.
- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి.
- వన్యప్రాణులను పరిరక్షించాలి
- జీవవైవిధ్యం రక్షణపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

ప్రకృతి హితంగా భారతీయత...

భారతీయ సంస్కృతిలో ప్రతి చిన్న ఆచారం ప్రకృతిహితంగానే ఉంటుంది. వ్యవసాయంలో ఏ విధమైన హైబ్రిడ్, బీటీ విత్తనాలు ఉండేవి కావు. రైతులే సొంతంగా విత్తనాలను తయారు చేసుకునేవారు. పశువుల పేడను ఎరువుగా ఉపయో గించేవారు. రైతు పండించిన పంట ఇంటికి రాగానే కొంత పిచ్చుకల కోసం సింహద్వారానికి ప్రత్యేకంగా కట్టి ఆహారంగా అందించేవారు. రసాయనాలు వాడనందున పొలంలో రకరకాల మిత్ర జీవాలు ఉండేవి.

ఇది ప్రకృతి వ్యవసాయం. జీవవైవిధ్యాన్ని కాపాడే అచ్చమైన భారతీయ వ్యవసాయ పద్ధతి. ఈ విధానంలో పూసిన పుష్పాలు కూడా మూడు రోజుల వరకు వాడిపోవు. పరిస్థితులు మారాయి. అధిక శాతం రైతులు హైబ్రీడ్ విత్తనాలు, నసాయన పురుగు మందులు, ఎరువులు ఉపయోగిస్తున్నారు. భూమిని రసాయన ఎరువులతో నింపుతున్నారు. ఇప్పుడిప్పుడు కొంత మంది రైతులు భారతీయ వ్యవసాయ విధానంపై దృష్టి మరల్చి మళ్లీ జీవవైవిధ్యాన్ని రక్షించే ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు.


నేపథ్యం....

1992లో రియోలో అంతర్జాతీయ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ పర్యావరణ సదస్సులో జీవ వైవిధ్య ధ్వంసంపై ఆందోళన వ్యక్తమైంది. జీవ వైవిధ్యాన్ని కాపాడాలని 150 దేశాలు తీర్మానిస్తూ సంతకాలు చేశాయి. ప్రతి సంవత్సరం మే 22న ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం నిర్వహించాలని తీర్మానించి అప్పటి నుంచి అమలు చేస్తున్నారు. 2010 సంవత్సరాన్ని జీవ వైవిధ్య సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2012లో హైదరాబాద్‌లో జీవవైవిధ్య సదస్సు నిర్వహించగా 193 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము, పామును తిని గద్ద జీవిస్తుంది. గద్ద మరణించాక దానిని క్రిములు తిని భూమిలో కలిపేస్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా జీవవైవిధ్య చక్రం. వీటిలో ఏ ఒక్క ప్రాణి అంతరించినా చక్రంలోని మిగతా అన్ని ప్రాణులపై ప్రత్యక్షంగా తీవ్రప్రభావం ఉంటుంది. మిగతా ప్రాణులపై పరోక్షంగా ముప్పు ఉంటుంది. ఇలా విశ్వంలో అనేక వృత్తాలు ఉంటాయి. వాటిలో మనుషులు ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనానికి దారి తీస్తుంది. ఏ ఒక్క జీవి అంతరించినా అది మాన మనుగ



డకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10 వేల జాతుల జీవరాశులు అంతరించిపోతున్నాయి. వరాశుల్లో ఏ ఒక్కటి అధికం, ఏ ఒక్కటి తక్కువ కాదు. ఒకదానిపై ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి.





రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి కాలం సెలవుల దృష్ట్యా రోజుకు రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి మరింతగా పెరుగుతోంది. బుధవారం ఉదయాన్నే భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి, కోడెమొక్కు క్యూలైన్లు, ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకొని పార్వతి రాజరాజేశ్వరస్వామివార్లను దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు ఎంతో ప్రీతిపాత్ర మైన కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాలు కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి హనుమాన్ భక్తులు తరలివచ్చారు.రాజన్నను దర్శించుకుని కొండగట్టు బయలుదేరారు.

పోలాండ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం

మల్యాల, మే 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న పోలాండ్‌లో కారు ఢీకొని మృతి చెందిన మల్యాల యువకుడు పొన్నం మనోజ్‌గౌడ్(29) మృతదేహం పది రోజుల కు బుధవారం సాయంత్రం స్వగ్రామంకు చేరుకుంది. మనోజ్ మృతదేహంను స్వదేశంకు పంపించడానికి తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ అడ్వయిజరీ కమిటీ సభ్యులు, పోలాండ్ తెలుగు అసోషియోషన్ అధ్యక్షుడు చంద్రబాను, కార్యదర్శి శైలేంద్ర, సభ్యులు కృషి చేయగా హైదరాబాద్ ఏయిర్‌పోర్టు నుంచి ప్రభుత్వం ఉచిత అంబులెన్సు సౌకర్యం కల్పించింది. స్వగ్రామం చేరుకున్న మనోజ్ మృతదేహంను చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగ అంత్యక్రియాల్లో ఎమ్మెల్యే, తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ అడ్వయిజరీ కమిటీ గౌరవ సభ్యులు మేడిపల్లి సత్యం పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు.

యువత క్రీడల్లో రాణించాలి

బుగ్గారం మే 21 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. బుధవారం బుగ్గారం మండలం గోపులపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టోర్నీలో గెలుపొందిన యస్వంతరావుపేట్ జట్టు సభ్యులకు ఇరవై వేల రూపాయలు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రన్నరప్ గోపులాపూర్ జట్టు కి పదిహేనువేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, మాజీ సర్పంచ్ బత్తుల తిరుపతి, రవీందర్‌రెడ్డి, తిరుపతి, వెంకన్న, మల్లేష్, తిరుపతి, శ్రీధర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగాయాత్ర

కోరుట్ల, మే21 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం పట్టణంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ ఆధ్వర్యంలో తిరంగాయాత్రను నిర్వంచారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుండి నందీ చౌరస్తా వరకు జాతీయ జెండాలను పట్టుకోని వర్షంను కూడ లెక్క చేయ్యకుండా ర్యాలీని నిర్వహించారు. .దేశ భక్తి సమైఖ్య వాదం చాటి దేశంలోని ప్రజలు ఐక్యమత్యంగా ఉండే విధంగా దేశ భక్తి ప్రతి ఒక్కరిలో ఇమిడే విధంగా ప్రజలు ఐక్యమత్యంగా ఉండాలని నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

మెట్‌పల్లిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేగుంట గ్రామ శివారులోని విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన కొత్తపల్లి నందు అనే రైతుకు చెందిన గొర్రె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన గొర్రె విలువ 20 వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతును ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

-ఈదురుగాలులకు కూలిన చెట్లు -విరిగి పడిన విద్యుత్ స్తంభాలు-విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి


మెట్‌పల్లిలో తడిసిన ధాన్యం బస్తాలు


లచ్చక్కపేటలో తడిసిన ధాన్యం

జగిత్యాలరూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో బుధవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోకి భారీగా వర్షం నీరు చేరి ధాన్యం బస్తాలు తడిచి ముద్దయ్యాయి. గుల్లపేట ఐకేపీ కొనుగోలు కేంద్రం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో సెంటర్‌లోకి వర్షం నీరు భారీగా చేరింది. కొనుగోళ్లు మందగించడంతోనే సెంటర్లలోని ధాన్యం అకాల వర్షాలకు తడిచి వర్షార్పణం పాలయ్యిందని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు.

●**కోరుట్ల/కోరుట్ల రూరల్:** కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. పట్టణంలోని పలు ప్రాంతాలలో రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. ఈదురు గాలులతో పట్టణంతో పాటు మండలంలోని లు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో అధికారులు మరమత్మలు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బండలింగాపూర్ వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో రాజేశ్వర్‌రావుపేటతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు తడిసిపోయాయి. బండలింగాపూర్‌లో 1000సంచులు, రాజేశ్వరరావుపేటలో 1000 తూకం వేసిన ధాన్యం సంచులు తడిసినట్టు అధికారులు తెలిపారు. మెట్‌పల్లి మార్కెట్ యార్డులోని 150సంచులు కూడా తడిసినట్లు అధికారులు తెలిపారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలో అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడిచి ముద్దయింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి మురికినీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

●**సారంగాపూర్:** మండలంలో అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోకి భారీ వరద నీరు వచ్చి చేరింది. రంగపేట, లచ్చక్కపేట కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి పోయింది. లచ్చక్కపేట కొనుగోలు కేంద్రంలో పెద్దఎత్తున వరద నీరు రావడంలో రైతుతు కాలువలు తీసి నీరును బయటకు పంపారు.

●**బీర్‌పూర్:** మండలంలో ఈదురు గాలులతో వర్షం కారణంగా విద్యుత్ స్థంభాలు, చెట్లు విరిగి పోయాయి. తెగిపడ్డ విద్యుత్ వైర్లకు తగిలి రెండు గేదెలు మృతిచెందాయి. సిర్‌పూర్‌కు చెందిన పర్స నర్సయ్య గేద, సామల శ్రీనివాస్‌లకు చెందిన గేదెలు మృతిచెందాయి. ఈదురు గాలులతో కండ్లపెల్లిలో పెళ్లి జరిగిన కాసేపటికే టెంట్లు, పెళ్లిపందిరి పూర్తిగా ధ్వంసం అయ్యాయి.

●**రాయికల్:** రాయికల్ పట్టణం, మండలంలో పలు గ్రామాలలో భారీ వర్షం కురిసింది. రాయికల్ పట్టణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పూర్తిగా తడిసింది.

●**మల్లాపూర్:** మల్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుకున్నారు.

●**ఎండపల్లి:** మండలంలో అకాల వర్షానికి వరి ధాన్యం కుప్పలు తడిసాయి. కొన్ని గ్రామాల్లో కొనుగోలు ప్రక్రియ వేగవంతం జరగక ఎక్కడి కుప్పలు అక్కడే ఉన్నాయి.

●**గొల్లపల్లి:** మండలంలో కురిసిన వర్షానికి పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షార్పణం అయింది. వర్షం ధాటికి చిల్వాకోడూర్, లొత్తునూర్ తదితర గ్రామాల్లో చెందోళి సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తూకం వేసిన వరి ధాన్యం బస్తాలు పాక్షికంగా తడిసిముద్దయ్యాయి. పలు గ్రామాల్లో నువ్వు పంట దెబ్బతిని రైతాంగానికి నష్టాన్ని మిగిల్చింది. శ్రీరాముల పల్లె, రాఘవ పట్నం, వెన్గుమట్ల, బీబీరాజ్ పల్లె, శంకర్రావు పేట, గంగాదేవి పల్లె, గొల్లపల్లి తదితర గ్రామాల్లో మామిడి పంట నేలరాలింది. ఇబ్రాహీజ్‌పల్లె నిర్వహిస్తున్న బీరప్ప పట్నాల కార్యక్రమంలో వర్షం ధాటికి టెంట్లు కుప్పకూలడంతో గ్రామస్థులు బెంబెలెత్తిపోయారు.


సిర్‌పూర్‌లో విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందిన గేదెలు

జీలుగ విత్తనాలతో భూసారం పెంపు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులు జీలుగ విత్తనాలు వాడి భూసారం పెంపొందించుకుని అధిక దిగుబడి సాధించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని కేడీసీఎంఎస్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల పంపిణీ కార్యాక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన రైతులకు తన చేతుల మీదుగా జీలుగ విత్తనాల బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు 50 శాతం సబ్సీడీపై జీలుగ విత్తనాలను రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ధర్మపురి మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22 గురువారం నుండి మండలంలో జీలుగ విత్తనాల పంపిణీ కొనసాగుతుందని అన్నారు. ధర్మపురి మండలంలో ధర్మపురి, జైనా, తిమ్మాపూర్ పీఏసీఎస్‌లో, ధర్మపురి డీసీఎంఎస్‌లో ప్రస్తుతం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు.

30 కిలోల బస్తా ధర రూ 2138 (50 శాతం సబ్సీడీపై) ఉందని ఆయన వివరించారు. రెండున్నర ఎకరాలకు ఒక బస్తా చొప్పున ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, జగిత్యాల ఏడీఏ తిరుపతినాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ఏవో రాజ్‌కుమార్, ఏఈవో అజయ్, కేడీసీఎంఎస్ ఇంచార్జ్ సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడిన ధీరవనిత అహల్యాభాయ్

జగిత్యాలఅగ్రికల్చర్, మే21(ఆంధ్రజ్యోతి): దేశంకోసం, ధర్మంకోసం పోరాడిన ధీరవణిత, రాణి అహల్యాభాయ్ హోల్కర్ అని అహ్యలభాయ్ జయంతి ఉత్సవాల కమిటీ జిల్లా కన్వీనర్ మర్రిపెల్లి సత్యం అన్నారు. రాణి అహల్యభాయ్ 300 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ బాధ్యులు నలువాల తిరుపతి, సాంబారి కళావతి ఉన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ఇబ్రహీంపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి):సీఎంఆర్ఎఫ్ చెక్కు పేదలకు వరంలాంటిదని ఇబ్రహీంపట్నం మాజీ జడ్పీటీసీ,కాంగ్రెస్ నాయకులు జంగిలి సునీత అన్నారు. బుధవారం ఇబ్రహీం పట్నం మండల కేంద్రానికి చెందిన ఇబ్రహీంపట్నం మండల గౌడ సంఘం మండలాధ్యక్షుడు బుస రాజేశ్వర్‌గౌడ్ తనయుడు బుస సాయి ప్రసద్‌కు మంజైరైన ఒక లక్ష నాలుగు వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును జంగిలి సునీత అందజేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు నిధుల కొరత

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టర్‌కు పెండింగ్‌లో సుమారు 49.80కోట్ల బిల్లులు మంజూరు చేస్తామని హామీని చ్చారు. అయినప్పటికీ కళాశాల భవన నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు.

● **అద్దెలతో ఆర్థిక భారం..**

జిల్లా కేంద్రంలో గల క్యాంపు ఆవరణలో వైద్య కళాశాల ఏర్పా టు చేయడానికి 2021 జూన్‌లో ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ భవననిర్మాణ పనులను ప్రారంభిం చారు. ఇప్పటికే ప్రథమ, ద్వితీయ సంవత్సరాల తరగతులు కొనసాగుతున్నాయి. ప్రతీబ్యాచ్‌కి 150మంది చొప్పున విద్యార్థులు న్నారు. ఈయేడాది మరో బ్యాచ్ ప్రారంభం కానుంది. ఈమేరకు వసతులు, సౌకర్యాలు లేకుండా పోయాయి. మెడికల్ కళాశాల తరగతులను తాత్కాలిక షెడ్లలో నిర్వహిస్తున్నారు. బాలికల వసతి గృహాన్ని నర్సింగ్ కళాశాల ఆవరణలో గల భవనంలో నిర్వహిస్తుం డగా, బాలుర వసతి గృహాన్ని పట్టణంలోని ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖకు ఆర్థిక భారం తప్ప డం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి మెడికల్ కళా శాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేగవంతం చేసేలా చర్యలు

-నవీన్, డీఈ, ఆర్‌అండ్‌బీ, జగిత్యాల

ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల పనుల బిల్లులు చెల్లించాల్సి ఉంది. నిధుల కొరత పనులపై ప్రభావం చూపుతోంది. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లాం. ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిదులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలను అంద జేస్తున్నాం. బిల్లులు మంజూరైతే పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కోళ్ల వ్యాన్

-త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బావి అంచున నిలిచిన కోళ్ల వ్యాన్

పెగడపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున కోళ్ల వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగిపడింది. ధర్మారం మండల కేంద్రానికి చెందిన కోళ్ల వ్యాన్ పెగడపల్లి నంది చౌరస్తా సమీపంలో అతి వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కన గల బావి అంచు వరకు వెళ్లి నిలవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో మండల కేంద్రంలో దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడిపి స్తంభానికి ఢీకొట్టడంతోనే ప్రమాదం సంభవించినట్లు సమీప ప్రాంత ప్రజలు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అటవీ భూములను చదును చేస్తే కఠిన చర్యలు'

మెట్‌పల్లి రూరల్, మే, 21 (ఆంధ్రజ్యోతి): అటవీ భూములు ఆక్రమించి చదును చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజర్ షౌకత్‌అలీ హెచ్చరించారు. మండలంలో ఆత్మకూర్ గ్రామ శివారులోని అటవీ భూమిని కొందరు అక్రమించే క్రమంలో చదును చేసిన భూమి హద్దులను గుర్తించి కందకం ఏర్పాటు చేయించారు. గతంలో అటవీ భూమిని చదును చేసి కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుతో వాటిని తొలగింపచేశారు. అటవీ భూములను కాపాడాలని గ్రామస్థులు పలుమార్లు కోరారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. దీంతో గ్రామస్థులు హద్దులు ఏర్పాటు చేయడానికి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కట్రివేటర్‌తో మెట్‌పల్లి పోలీసుల బందోబస్తుతో బుధవారం కందకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారులు చైతన్యశ్రీ, అరుణ్‌కుమర్, బీట్ అధికారులు సత్తార్, శివరాజ్, పోలీసు సిబ్బంది, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


భూమేశ్వర్(ఫైల్)

ధర్మపురి, మే 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జాతీయ రహదారి వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొని ఒడ్నాల భూమేశ్వర్ (40) అనే వ్యక్తి బుధవారం మృతిచెందాడు. ఎస్‌ఐ కథనం ప్రకారం ధర్మపురికి చెందిన ఒడ్నాల భూమేశ్వర్ తన భార్య బిందును కరీంనగర్ బస్సు ఎక్కించేందుకు మోటార్ సైకిల్‌పై ధర్మపురి బస్టాండ్‌కు వచ్చాడు. తన ముందు నుంచే బస్సు భార్యను బస్సు ఎక్కించేందుకు బైక్‌పై బురుదేశిపల్లె వైపు వెళ్లాడు. ధర్మపురి శివారులో గల భారత్ పెట్రోల్ బంక్ వరకు చేరుకోగానే జగిత్యాల నుంచి ధర్మపురి వైపు వస్తున్న టాటా ఏసీ వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మోటార్ సైకిల్ పైనుండి కింద పడగా భూమేశ్వర్ తలకు తీవ్ర గాయాలుఅయ్యాయి. బిందు కుడి కాలుకు గాయమయ్యింది. భూమేశ్వర్ కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టాటా ఏసీ వాహనం నడిపిన వ్యక్తిని సల్లూరి రాజేష్‌గా గుర్తించారు. మృతుడి భార్య బిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ భూమేశ్వర్ పార్థివ దేహానికి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో బుధవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'రాజీవ్‌యువ వికాసం' ఇంటర్వ్యూలు

జగిత్యాలరూరల్, మే 21: రాజీవ్‌యవ వికాసం పథకం దరఖాస్తుదారులకు సోమవారం నుంచి 29 వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎంపీడీవో సీర్ల రమాదేవి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జగిత్యాల రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు.

●రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు సోమవారం నుంచి 29 వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు జగిత్యాల అర్బన్ ఎంపీడీఓ విజయలక్ష్మీ తెలిపారు. ఉదయం 10గంటల నుండి జగిత్యాల అర్బన్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

●కథలాపూర్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు సోమవారం నుంచి 29 వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

●మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మల్లాపూర్ ఎంపీడీవో శశికుమార్ బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు.

●రాయికల్: రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు సోమవారం నుంచి 29వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు.

●మెట్‌పల్లి రూరల్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఈనెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు.

●ఇబ్రహీంపట్నం: రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూలు సోమవారం నుంచి 29వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాంబారి చంద్రశేఖర్ తెలిపారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


కోరుట్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, మే 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశంను అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా నడిపించాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, గడ్డం మధు, కొంత రాజం, మహిపాల్ రెడ్డి, పసుల కృష్ణాప్రసాద్, అక్బర్, కటకం చంద్రశేఖర్, గంగాధర్, చిట్యాల లక్ష్మీనారాయణ, శ్రీరాముల అమరేందర్, మర్రిపల్లి జనార్ధన్, రమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో, జువ్వాడి భవన్‌లో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు బుధవారం రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నాయిని సురేష్‌గౌడ్ తదితరులుపాల్గొన్నారు.

●రాయికల్: ప్రజాస్వామ్యంలో యువతను భాగస్వామ్యం చేసేందుకు ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీది బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్ పాల్గొన్నారు.

●వెల్గటూర్: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిర స్మరణీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెల్గటూర్‌లో అంబేడ్కర్ చౌక్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొల్ల తిరుపతి, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, గుండాటి సందీప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గంగ్ర శ్రీకాంత్ రావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి రమేష్ పాల్గొన్నారు.

●కథలాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : దేశ మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. డిజిటల్ ఇండియా, కంప్యూటర్ విప్లవానికి ఆద్యుడిగా రాజీవ్‌గాంధీ చరిత్రలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారని గుర్తు చేశారు. నిరుపేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాజీవ్‌గాంధీ ని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగారని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, అంబటి రాధాకృష్ణ, శంకర్, సత్యనారాయణ, వర్ధినేని లింగారావు ఉన్నారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

మెట్‌పల్లి రూరల్, మే, 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారు చేసిన, విక్రయాలు జరిపిన కఠిన చర్యలు తీసుకోబడునని మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 లీటర్ల గుడుంబ, 1500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

క్రీడలను ప్రోత్సహించాలి

మెట్‌పల్లిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని క్రీడాల వలన స్నేహభావం ఏర్పడుతుందని, క్రీడల వల్ల శారీరక మానసిక ఉల్లాసంతో పాటు విద్యార్థులు ధృడంగా ఉంటారని ప్రముఖ పిల్లాల వైద్య నిపుణులు డాక్టర్ చిలుక చైతన్య అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంలో ప్రారంభమైన జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంబించారు.

విద్యార్థులు యూనిఫాంలు నాణ్యతతో ఉండేలా చర్యలు


దుస్తుల తయారీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రఘువరణ్

జగిత్యాలరూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మహిళ సంఘ సభ్యుల ద్వారా నాణ్యతో కూడిన ఏకరూపదుస్తులను కుట్టించి ఇస్తుందని డీఆర్‌డీఓ రఘువరణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో గ్రామైఖ్యసంఘం ఆధ్వర్యంలో మహిళసభ్యురాళ్లు కుడుతున్న ఏకరూప దుస్తుల యూనిట్‌ను రఘువరణ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో డీపీఎం మల్లేశం, ఏపీఎం ఓదెల గంగాధర్, సీసీ రవీందర్, వీఓఏ రమ, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు సంబంధించి కొనుగోళ్ల ప్రక్రియ ముగింపు దశకు వచ్చాయని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా లో 137 ఐకేపీ కేంద్రాల్లో 65 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తిఅయినట్లు తెలిపారు. అంతకు ముందు గుల్లపేట ఐకేపీ కేంద్రాన్ని జిల్లా మార్కెటింగ్ డీపీఎం విజయభారతి సందర్శించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీ రవీందర్, శ్రీనివాస్, వీఓఏ లు రమ, జ్యోతి పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

రాయికల్, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, శాస్త్రవేత్తలు అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో బుధవారం "రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ జి.వేణుగోపాల్ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణ, రసాయనిక ఎరువుల వినియోగం, యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. నేలలో సేంద్రియ కర్బన నిల్వలను పెంపొందించడం, భూసార పరీక్షల ఆధారంగా పంటలలో ఎరువుల వినియోగం గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా పంటలలో చీడపీడల నివారణ పద్ధతుల గురించి, రశీదులను భద్రపరచడం గురించి డాక్టర్ ఎల్లాగౌడ్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, ఏఈవో సృజన, రైతులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌కు వినతి

కొడిమ్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నుంచి జగిత్యాల వైపు నడిచే బస్సు కొడిమ్యాల బస్టాండ్ నుంచి అంగడి బజార్ వరకు ప్రతి రోజు 3 ట్రిప్పులు నడపాలని కోరుతూ కొడిమ్యాల మాజీ సర్పంచ్ ఏలేటి మమత నర్సింహా రెడ్డి బుధవారం వేములవాడ డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నడపాలని, ఈ మార్గంలో ప్రజలు రోజు ప్రయాణిస్తున్నారు గానీ సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

నోటీసులతో కేసీఆర్‌పై కక్ష సాధింపు

కథలాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం కమీషన్ పేరిట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు అందించి సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తున్నాడని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆరోపించారు.

బుధ వారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తెలంగాణకు అపర భగీరథునిగా పేరుగాంచి దేశంలోనే తెలంగాణ ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు.